క్లుప్తంగా

తాగునీరు వృథా



ట్యాంకు నుంచి వృథాగా పోతున్న తాగునీరు

ఏలేశ్వరం: స్థానిక రూపులమ్మ గుడి సమీపంలోని జీఎల్ఆర్ ట్యాంక్ నుంచి తాగునీరు వృథాగా పోతోంది. ట్యాంక్ పైపులు లీకవడం, కుళాయిలకు ట్యాప్ లేకపోవడంతో మంచినీరు నేలపాలవుతోంది. నిత్యం ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చే ట్యాంక్ నుంచి తాగునీరు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ట్యాంక్ నిండా చెత్త, నాచు పేరుకుపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళి



ప్రత్తిపాడులో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీను

ప్రత్తిపాడు: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు అంబేడ్కర్ కళామందిర్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాషరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, దాసరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం చేతిపంపు ఏర్పాటు



బోరు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శివ

తొండంగి: రైతులు, కూలీల తాగునీటి సౌకర్యార్థం గోపాలపట్నం శివారులో చేతిపంపు ఏర్పాటు చేశారు. ఈ పనులను సర్పంచ్ కటకం శివ ప్రారంభించారు. నిత్యం గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళుతుంటారు. వారికి ఉపయోగపడేలా రూ.60 వేలతో తాగునీటి బోరు వేయించినట్టు సర్పంచ్ శివ తెలిపారు.

బీఎల్వోలతో సమీక్ష



బీఎల్వోలతో మాట్లాడుతున్న అధికారులు

తొండంగి: మండలంలోని ఓటర్ల జాబితా రూపకల్పనకు సంబంధించి ఈ నెల 4, 5వ తేదీల్లో క్యాంపెయినింగ్ నిర్వహించాలని బీఎల్వోలను ఈఆర్వో ఏవీఎన్ఎస్ మూర్తి ఆదేశించారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యంతో కలిసి బీఎల్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు, మరణించిన వారి పేర్లు తొలగింపు, అడ్రాస్ మార్పులు ఉంటే వెంటనే చేపట్టాలని చెప్పారు. దీనికోసం ఈనెల 4, 5న అన్ని గ్రామాల్లో క్యాంపెయినింగ్ నిర్వహించాలన్నారు. ఆర్ఐ వెంకటేశ్వరరావు, రెవెన్యూశాఖ సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడే



ఆగమనరావు దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓ రాజబాబు

ప్రత్తిపాడు: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు అన్నారు. స్థానిక డీఎన్‌టీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాకినాటి ఆగమనరావు ఉపాధ్యాయుడిగా ముప్పై రెండున్నర సంవత్సరాల సర్వీసును పూర్తి చేసుకుని ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో ఆగమనరావు దంపతులను ఎంఈఓ రాజబాబు, ఎంఈఓ-2 వై అచ్చిరాజు శాలువాలను కప్పి, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల యూటీఎఫ్ నాయకులు రాపర్తి రామలింగేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, సీఆర్పీలు రాంజీ, భాషా, మల్లేష, జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు రామలక్ష్మి, ధనలక్ష్మి, తలుపులు తదితరులు పాల్గొన్నారు.

నీరు లేక.. సాగు సాగక..

- ఎండుతున్న పంటలు
- వర్షాల కోసం ఎదురుచూపు
- ఆందోళనలో అన్నదాత

నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు వివరాలు

మండలం	సాధారణ విస్తీర్ణం ఎకరాలలో	ప్రస్తుత సాగు ఎకరాలలో
ప్రత్తిపాడు	4,366	3,394
ఏలేశ్వరం	2.289	2,274
రౌతులపూడి	2,134	1,479
శంఖవరం	1,459	741
మొత్తం	10,248	7,888



చిరుపొట్ట దశలో ఉన్న ఖరీఫ్ సాగును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ప్రత్తిపాడు: ఖరీఫ్‌పై వరుణుడు ముఖం చాటేశాడు. ఏడాది ఆరంభంలో కురిసిన వర్షాలకు రైతులు వరిసాగు చేశారు. తర్వాత వర్షాలు కురవక సాగునీరందక పంట ఎండుతుండడంతో ఇబ్బంది పడుతున్నారు. వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో సాధారణ విస్తీర్ణం 10,248 ఎకరాలు ఉండగా వర్షాభావ పరిస్థిల నేపథ్యంలో రైతులు నీటి తడి అందించి, 77 శాతం విస్తీర్ణంలో పంట సాగు చేస్తున్నారు. మిగిలిన విస్తీర్ణంలో కొంత మేర సరుగుడు, పామాయిల్ వంటి పంటలు వేశారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం, ఒమ్మంగి, గోకవరం గ్రామాల్లోనే సుమారు 300 ఎకరాలకు పైబడి సాగు లేకుండా సారవంతమైన భూమిని వదిలిపెట్టేశారంటే వర్షాభావ పరిస్థితిని అంచనా వేయవచ్చు.

నియోజవర్గంలో 10,248 సాధారణ విస్తీర్ణం కాగా రైతాంగం 7,888 ఎకరాల్లోనే సాగు చేపట్టారు. రైతులు ఎక్కువగా ఎంటీయూ 1064, ఎంటీయూ 7029, ఆర్‌జీఎల్ 2537, బీపీటీ 5204 (సాంబమసూరి), ప్రైవేటు వంగడాలైన రేవతి, సంపతి స్వర్ణ, సాధన వంటి వంగడాలనే సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట చిరుపొట్ట దశలో ఉంది. తొలుత వాతావరణం అనుకూలించడంతో రైతాంగం ఉత్సాహంగానే పంట పండించారు. మళ్లీ చిన్నపాటి వర్షమైనా పడితే తప్ప పంట జీవం పోసుకోలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే చినుకు జాడ లేకపోవడంతో సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో సాగుకు నోచుకోలేదు.

వాన కురవక..



మెట్టలో వర్షాలు కురవక ఎండ వేడిమితో భూమిలో తేమ శాతం లేకపోతే పంట ఎండిపోతుంది. ఇలాగే ఉంటే ఇబ్బందే. వాన పడకపోతే రైతు పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుంది. పంట ఎండిపోయి పెట్టుబడులు కూడా రావు.

– తటవర్తి అయ్యన్నదొర, రైతు, టి.రాయవరం,

రైతుల ఎదురుచూపు



ప్రస్తుతం భూమిలో తేమ లేదని కొంత మంది రైతులు విత్తనాలు వేయలేదు. అందరూ వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వర్షం కురిస్తే దిగుబడి బాగుటుంది. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రత్యామ్నయ పంటలు వేయవచ్చు.

– యింటి వీర గంగాధర్, ఇన్‌చార్జి ఏడీఏ, జగ్గంపేట

'వై ఏపీ నీడ్స్ జగన్'ను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

శంఖవరం: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని కొంతంగి గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను ఆధ్వర్యంలో సచివాలయం కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఈ నెల 9 నుంచి డిసెంబర్ 31 వరకూ జరిగే వై ఏపీ నీడ్స్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, వైస్ ఎంపీపీలు ఈగల చిన్నమ్ములు, ధారా వెంకట రమణ, జెడ్పీటీసీ తరుం రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్‌రాజా, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబరు నక్కా అశ్విని, పార్టీ నాయకులు గాబు కృష్ణ, కొండపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- కిర్లంపూడిలో మండల సర్వ సభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట రవి అధ్యక్షతన జరిగిన మండల సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే మండల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా అర్హులైన వారికి సంక్షేమ పథకాలతో పాటు ప్రజా ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కార్పొరేట్ వైద్యం అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీపీ రవి శాఖల వారీగా సాధించిన ప్రగతిని సమీక్షించి ప్రజాప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ మేరకు ప్రజాప్రతినిధుల నుంచి విద్యుత్, అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణాలతో పాటు పలు సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

విమర్శలు సరికాదు: రాష్ట్ర ప్రజల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని విమర్శించడం ప్రతిపక్షాలకు పరిపాటిగా మారిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తోట గాంధీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, పెంటకోట నాగబాబు, దోమాల గంగాధర్, సంఘన వెంకటేశ్వరావు, గొరకపూడి గోపి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు బిళ్ళకుర్తి నాగమణి, మొల్లేటి సరస్వతీ, కోఆప్షన్ సభ్యులు మీకా, ఎంపీడీఓ బడే రాజేశ్వరావు, తహసీల్దార్ మాధవరావు పలువురు ఉన్నారు.

దేశానికే ఆదర్శం జగనన్న ఆరోగ్య సురక్ష



సింహాద్రిపురంలో రోగులకు మందులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



రాపాకలో సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ సత్య నాగేశ్వరరావు, నాయకులు



ఏలేశ్వరంలో కిట్లు అందజేస్తున్న అధికారులు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని సింహాద్రిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ కాలపురెడ్డి పాపయమ్మ అధ్యక్షనత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే చంటిబాబు పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహార కిట్లు, పలువురు రోగులకు మందుల కిట్లను అందజేశారు. ఈశిబిరంలో 380 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యులు తోట గాంధీ, కాలపురెడ్డి కాశీవిశ్వనాథం, నంది బాలకృష్ణ, నంది వెంకన్న, గొడుగుల కొండబాబు, దోమాల గంగాధర్, బొజ్జపు శ్రీను, సామిరెడ్డి తాతారావు, మొగిలినాగ గంగబాబు, నంది రాజారావు, వైద్య సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

సురక్షతో ఖరీదైన వైద్యసేవలు

తుని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలందరికి ఖరీదైన వైద్య సేవలను అందిస్తుందని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం తుని మండలం రాపాకలో సర్పంచ్ గూడుపు గౌరీకుమారి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైస్ ఎంపీపీ శిభిరాన్ని ప్రారంభించి, సురక్ష కిట్లను అందజేశారు. ఎంపీటీసీ గంట్ల రమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, నాయకులు చిటికెల వరహాలబాబు, కార్యదర్శి ఎస్ వీ.ఆదిద్య, వైద్యసిబ్బంది, సచిలయ కన్వీనర్లు, గృహ సారధులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వైద్యసేవలు

ఏలేశ్వరం: ప్రతి ఇంటికీ వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 1, 17 వార్డుల పరిధిలో మంగళవారం ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటికి, ప్రతి కుటుంబానికి వైద్య సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బవురువాక గ్రామంలో...

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని శాంతి ఆశ్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బవురువాక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సత్యనారాయణ, ఎంపీటీసీ అమరాది కాశీ, వైఎస్సార్ సీపీ నాయకుడు రంగనాథం అబ్బాయి, సచివాలయ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గోకవరంలో..

గోకవరం: స్థానిక సచివాలయం-4 కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సుంకర వీరబాబు ఈ వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



కౌన్సిల్ సమావేశం జరుగుతున్న దృశ్యం

ఏలేశ్వరం: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణంలో నిర్వహించిన గడపకు గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచివాలయాల పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో డ్రైన్లు, సీసీ రోడ్లు వేసేందుకు పనులను ఆమోదించారు. తొలుత కౌన్సిలర్ బొది రెడ్డి గోపి వీధిదీపాలు వెలగడం లేదని ఆరోపించారు. మరో కౌన్సిలర్ మూది నారాయణస్వామి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. సమస్యల పరిష్కారంలో అధికారుల అలసత్వంపై సమావేశం నుంచి వీరితోపాటు పలువురు కౌన్సిలర్లు బయటకు వెళ్లిపోయారు. కార్యక్రమంలో కమిషనర్ కె.శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీదేవి ఉత్సవాలు



ధర్మవరంలో నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులుఊ

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలో గౌరీశంకరుల ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అట్లతద్దికి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలను సంక్రాంతి వరకూ నిర్వహిస్తారు. ఇప్పటి నుంచి వీధి నాటకాలను కళాకారులు ప్రదర్శిస్తారు. మంగళవారం వెంకన్నబాబు వీధి నాటకాలను ప్రదర్శించారు. ఈ నాటకంలో గోవిందా గోవిందా భక్తులుగా బలిజి వీర్రాజు, బర్ల రాజబాబు, పేండ్యాల అబ్బు, గొందాల శ్రీను, బుద్దాల ముసిలి నటించారు. ఈ నాటకం స్థానికులను విశేషంగా ఆకట్టకుంది. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్-డ్రెస్సింగ్ చేశారు. ఈ ఉత్సవాలను గ్రామస్తులు 87 సంవత్సరాలు నిర్వహిస్తున్నారు. కళలకు పుట్టినిల్లుగా భావించే ధర్మవరంలో గౌరీదేవి ఉత్సవాలను ఆలయ కమిటీ అత్యంత వైభవంగా నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.

ఎంఎల్ఎస్ గోడౌన్లలో ఆకస్మిక తనిఖీ



డీఎస్ఓకు సమస్యలు వివరిస్తున్న తుని రూరల్, పట్టణ డీలర్లు

తుని రూరల్: రేఖవానిపాలెంలో పౌర సరఫరాల శాఖ (ఎంఎల్ఎస్ పాయింట్) గోడౌన్లను ఆ శాఖ జిల్లా అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం డీఎస్ఓ ప్రసాదరావు, ఏఎస్ఓ ప్రసన్న, ఎంఎస్ఓ కిరణ్ కుమార్ తనిఖీ చేశారు. గొడౌన్ల పర్యవేక్షణ అధికారి ఇర్ఫాన్ సమయ పాలన పాటించకపోవడం, నవంబరుకు సంబంధించిన సరకులను చౌకధరల దుకాణాలకు విడుదల చేయకపోవడంపై డీఎస్ఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆయా చౌకధరల దుకాణాలకు సరకులు విడుదల చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తుని రూరల్, పట్టణ చౌకధరల దుకాణాల డీలర్లు డీఎస్ఓ, ఏఎస్ఓలను కలసి వినతిపత్రం అందజేశారు. ఎంఎల్ఎస్ పాయింట్‌ను మార్చాలని, తూకాల్లో నష్టాలను నివారించాలని కోరారు. డీలర్ల ఆసోసియేషన్ జనరల్ సెక్రటరీ పోలిశెట్టి శివకేశవరావు, ప్రెసిడెంట్ బి.రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీలకు పోస్టల్ బీమా

గోకవరం: మండలంలోని పీఎంపీ అసోసియేషన్ సభ్యులకు రాజమహేంద్రవరానికి చెందిన బీవీఎస్ హాస్పిటల్ సహకారంతో పోస్టల్ డిపార్ట్‌మెంట్ యాక్సిడెంట్ బీమా పాలసీ చేయించారు. సుమారు 50 మంది సభ్యులకు మంగళవారం గోకవరంలో స్థానిక ఈశ్వర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ జిల్లా కోకన్వీనర్ బళ్లా శ్రీనివాస్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పీఎంపీలకు పోస్టల్ బీమా కల్పించడంపై కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు పి.చిన్ని, అధ్యక్షుడు ఎమ్.నాగేశ్వరరావు, కార్యదర్శి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి



ప్రత్తిపాడులో పటేల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సుధాకర్



కోటనందూరులో వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు



వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: భారతరత్న, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కోనేటిబడి వద్ద న్యాయవాది చిట్టంశెట్టి పుల్లయ్య ఆధ్వర్యంలో పటేల్ విగ్రహాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బ్రిటీషు వారిని ఎదిరించి ఉక్కుమనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశ తొలి ప్రధానమంత్రి పటేల్ చేసిన సేవలు అపూర్వమన్నారు. పటేల్ జీవితాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైస్ చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో..

జగ్గంపేట: భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవం జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపడీడీఓ వసంతకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు, వలంటీర్లు పాల్గొన్నారు.

తొండంగి మండలంలో..

తొండంగి: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో జాతీయ సమైక్య దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాకదారిపేట కేజీబీవీలో ప్రిన్సిపాల్ ఘంటశాల రాజేశ్వరీ ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ సమైక్యత కోసం అవగాహన కల్పించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ మెహర్ ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు.

దేశాభివృద్ధికి పటేల్ కృషి మరువలేం

కోటనందూరు: దేశాభివృద్ధికి ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఎంతో కృషి చేశారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్దార్ వల్లభాయిపటేల్ జయంతిని నిర్వహించారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ వల్లభాయి పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పటేల్ ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని సూచించారు. వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, వివిధ శాఖల ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం దేశ తొలి ఉప ప్రధాన మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, ద్విభాష్యం శ్రీనివాసరావు, పరిపాలనాధికారి జె శ్రీనివాస్, ఎం శ్రీనివాసు, పి సురేష్, ఐఎస్ రత్నం, సర్పంచ్ గొనగాల అప్పలరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు పినిశెట్టి ప్రకాష్, తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ



పూజలో పాల్గొన్న స్వాములు

జగ్గంపేట: గ్రామంలోని గోపాలరావు వీధిలో అయ్యప్ప స్వామి పడిపూజ మంగళవారం వైభవంగా జరిగింది. గురుస్వామి మామిళపల్లి రామకృష్ణ, అర్చక పురోహిత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిళ్లపల్లి అయ్యప్ప ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో 1500 మంది అయ్యప్పలు పాల్గొన్నారు. గురుస్వామి మనమడు నారాయణ ఆశ్రిత్ స్వామి మొదటి సారి మాల ధరించిన సందర్భంగా ఏర్పాటు చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రత్తిపాడు: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేస్తున్న కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు స్థానిక ఎలక్ట్రికల్ ఏడీఏ రాజశేఖరం తెలిపారు. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లి, ఏలూరు, ఒమ్మంగి, టి.రాయవరం, కిర్లంపూడి మండలంలోని కిర్లంపూడి, సింహాద్రిపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

3న విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: ఏవీ నగరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనుల కారణంగా ఈ నెల 3న విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ రత్నాలరావు ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ పెరుమాళ్లపురం, ఎ.వి.నగరం, బుచ్చియ్యపేట, గడ్డిపేట, కోదాడ, శృంగవృక్షం, సీతారాంపురం, శృంగవృక్షం, ఆవులమంద, గోర్సపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

జగ్గంపేటలో దైవ సేవకుల సమావేశం

జగ్గంపేట: స్థానిక బాలాజీ హోటల్లో దైవ సేవకుల సమావేశం జరిగింది. ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి కె.జాన్‌వెస్లీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీఐఎఫ్ డైరెక్టర్ వరల్డ్ బుక్ ఆఫ్ అనార్జి రెవరెండ్ డాక్టర్ బీహెచ్‌వీ మూర్తి రాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి 15 సూత్రాల కాకినాడ జిల్లా నాయకులు డాక్టర్ జార్జ్‌బాబు, పాస్టర్స్ ఫెలోషిప్ రీజనల్ చైర్మన్ శామ్యూల్ సుదర్శన్, కాకినాడ పాస్టర్స్ ఫెలోషిప్ సీనియర్ నాయకులు రెవరెండ్ జాన్ డానియల్, వివిధ మండలాలకు చెందిన పాస్టర్స్, జగ్గంపేట కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.

అన్నసంతర్పణ



దేవీచౌక్ ఆలయం వద్ద జరుగుతున్న అన్నదానం

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నదానం జరిగింది. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంబాల శ్రీనివాస్‌రావు, గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు ఏడు వేల మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ మాట్లాడుతూ ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ముగిశాయన్నారు. దీనికి సహకరించిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.